క్లుప్తంగా

కార్యకర్త కుటుంబానికి చెక్కు అందజేత



గణేష్ తల్లికి బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే, పార్టీ నాయకులు

నర్సాపూర్: మాసాయిపేటకు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త గణేశ్ కుటుంబ సభ్యులకు రూ.2లక్షల బీమా చెక్కును బుధవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి అందజేశారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. అలాగే.. నర్సాపూర్‌కు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందచేశారు. ఆమె వెంట పార్టీ నాయకులు నాగరాజు, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, పవన్, శివశంకర్ తదితరులు ఉన్నారు.

రైతులు వివరాలు అందించాలి



మాట్లాడుతున్న ఏడీఏ రాజ్‌నారాయణ

రామాయంపేట(మెదక్): రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు సంబంధించి నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) రాజ్‌నారాయణ పేర్కొన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ.. భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా గుర్తింపు సంఖ్య కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం ప్రతిని జత చేసి ఇవ్వాలని సూచించారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా ఈ విశిష్ట సంఖ్య ఎంతో కీలకం కానుందని, రైతులు 11 అంకెల నంబర్ పొందడానికి వివరాలు అందజేయాల్సి ఉంటుందని చెప్పారు.

దుర్గమ్మను దర్శించుకున్న సిద్దేశ్వర మహారాజ్



దుర్గమ్మ సేవలో నందగిరి మహారాజ్

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గా మాతను బర్దీపూర్ మహారాజ్ సిద్ధేశ్వర నందగిరి మహారాజ్ బుధవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శంకర శర్మ,పార్థివశర్మకు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. సూర్య శ్రీనివాస్ ఆలయం తరపున సత్కరించారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ



కొనుగోలు కేంద్రం తనిఖీ చేస్తున్న తహసీల్దార్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం తహసీల్దార్ మన్నన్ తనిఖీ చేశారు. అలాగే.. మదూర్, చెన్నాయిపల్లి, వెంకట్రావుపల్లి గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంటా చేసిన ధాన్యం వెంటవెంటనే లారీలలో లోడ్‌చేసి రైస్‌మిల్లులకు పంపించాలని నిర్వాహకులకు సూచించారు. లారీల సమస్య ఉన్న, రైసు మిల్లులో అన్‌లోడ్ సమస్య ఉంటే మ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పేటలో విజయోత్సవ ర్యాలీ



సంబరాలు నిర్వహిస్తున్న నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): కశ్మీర్ ఉగ్రదాడులకు ప్రతీకార చర్యగా నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీని బుధవారం చిన్నశంకరంపేటలో బీజేపీ నాయకులు నిర్వహించారు. ర్యాలీలో పార్టీలకు అతీతంగా నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజు, బీజేపీ జిల్లా నాయకులు మల్లారెడ్డి, నర్సింహులు, మండల నాయకులు దశరథం, శంకర్, మహేష్, సాయి కిరణ శివ, బీఆర్ఎస్ నాయకులు సురేష్, చిప్ప కృష్ణ పాల్గొన్నారు.

చెరువు మట్టి చేనుకు బలం

- తక్కువ ఖర్చు.. అధిక దిగుబడి
- సారవంతంగా మారనున్న భూమి

టేక్మాల్(మెదక్): పంట దిగుబడి పెరగాలని రైతులు పొలంలో మోతాదుకు మించి ఎరువులు, రసాయనాలు చల్లుతున్నారు. పెరిగిన ఎరువుల ధరలతో పాటు పంటలకు అధికంగా ఎరువులు వాడడంతో పెట్టుబడి ఖర్చు పెరుగుతోంది. రసాయన ఎరువులు వాడుతుండటంతో భూమి కూడా దెబ్బతింటుంది. దీంతో సేంద్రియ ఎరువుల వాడ కంతో పాటు రైతులు పంట పొలంలో చెరువు పూడిక మట్టిని పోయించుకుంటున్నారు. దీంతో భూమి సారవంతంతో పాటు దిగుబడి పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



టేక్మాల్‌లోని ఓ రైతు పొలంలో వేసిన చెరువుమట్టి

వేసవిలో అనుకూలం

వ్యవసాయ భూముల్లో చెరువులోని సారవంతమైన పూడిక మట్టిని వేసుకోవడం కోసం వేసవి కాలంలో చెరువులు ఎండిపోవడంతో పూర్తిగా నల్లమట్టి లభిస్తుంది. పూడిక తీసేందుకు అనుకూలమైన సమయంతో పాటు ఎలాంటి పంట ఉండదు. దీంతో పూడిక మట్టిని వ్యవసాయ భూముల్లో పోయించుకుంటున్నారు. మట్టిలోడుతో ట్రాక్టర్లు సైతం చేనంతా తిరగడానికి వీలుగా ఉంటుంది. టేక్మాల్ మండల పరిధిలోని అనేక గ్రామాల్లో మట్టిని రైతులు పొలాల్లో పోయించుకుంటున్నారు.

చెరువు మట్టితో ఉపయోగాలు

- చెరువు మట్టిని పొలాల్లో వేయడం వలన ఆమ్ల, క్షార గుణాలతో భూమి బలంగా మారుతుంది.
- నేలల్లో లవణాల గాఢత తగ్గుతుంది. సూక్ష్మ, స్థూల పోషకాల స్థాయి, ముఖ్యంగా నత్రజని స్థాయి పెరుగుతాయి.
- రసాయనిక ఎరువుల వాడకం కొంత మేర తగ్గుతుంది.
- మొక్కలు ఆరోగ్యంగా, ఎత్తుగా పెరిగి అధిక దిగుబడి వస్తుంది.
- చెరువు మట్టిలో ఒండ్రు, బంకమట్టితోపాటు పంటలకు అవసరమయ్యే నత్రజని, భాస్వరం, పో బాష్ తోపాటు ఇతర సూక్ష్మ పోషకాలు ఉంటాయి.
- చెరువు మట్టిని చేనులో పోసుకొని చేనంతా చల్లుకోవడం ద్వారా నేలకు అన్ని పోషకాలు అందుతాయి. దీంతో నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతోంది.
- నల్లమట్టిలో సేంద్రియ కర్బనం, సూక్ష్మ పోషక మూలకాలు అధికంగా ఉంటాయి. దీంతో మొక్కలు రోగ నిరోధక శక్తిని కల్గి ఉంటాయి.
- రసాయన ఎరువులకు బదులు నల్లమట్టిని వినియోగించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయి.

భూసారం పెరుగుతుంది



చెరువులో పూడిక తీయగా వచ్చిన మట్టిని పంటచేలకు తరలిస్తే భూసారం పెరుగుతుంది. చెరువు మట్టిలో సేంద్రియ కర్బనాలు, సూక్ష్మ పోషకాలు ఎక్కువ మోతాదులో ఉంటాయి. ఇసుక, దుబ్బ నేలల్లోను నల్లమట్టి పోస్తే భూసారం మరింతగా వృద్ధి చెందుతోంది. తేమ శాతం కూడా ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. పంట ముగిసే వరకు ఎరువుల పని చేస్తుంది. పంట దిగుబడి కూడా అధికంగా ఉంటుంది.

–రాం ప్రసాద్, వ్యవసాయాధికారి, టేక్మాల్

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు

నర్సాపూర్ రూరల్: మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దని వ్యవసాయ శాస్త్రవేత్తలు అమీర్ బాష, ఆపిపా జవాన్, సుశీల, రాధిక రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని నారాయణపూర్, తుల్జారాంపేట గ్రామాలలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా రెండు గ్రామాలలో రైతులకు వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. పంటలు సాగు చేసే ముందు తమ భూముల మట్టి నమూనాలను పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సూచన మేరకు పంటలు సాగు చేసుకోవాలన్నారు. పంటల మార్పిడి, సస్యరక్షణ, వరి పత్తి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

పంటల సాగులో మెలకువల వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి రైతు ఫార్మర్ ఐడీ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిని దీపిక, ఏఈఓలు రవి వర్మ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నేడు రైతులతో సమావేశం

నర్సాపూర్: సంగారెడ్డి రీచ్–2 కెనాల్‌కు భూములు కోల్పోతున్న రైతులతో గురువారం సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ మహిపాల్ తెలిపారు. సంగారెడ్డి కెనాల్‌కు మండలంలోని లింగాపూర్‌కు చెందిన పలువురు రైతులు భూములు కోల్పోతున్నారని, వారితో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. రైతులకు ఏమైనా అభ్యంతరాలు, రికార్డులలో తప్పులున్నా తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవానికి రండి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి గూడూర్‌లో నూతనంగా నిర్మించిన గురుపీఠంలో ప్రతిష్ఠించనున్న సాయిబాబా, దత్తాత్రేయ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవానికి రావాల్సిందిగా శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో బర్దిపూర్‌లోని దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి శ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవదూతగిరి మహారాజ్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. జూన్ 5న జరిగే మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు శివకుమార్‌గౌడ్ తెలిపారు.

నేడు వెంకటాపూర్‌లో మెగా వైద్యశిబిరం

రామాయంపేట(మెదక్): రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని వెంకటాపూర్ ఆర్‌లో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సొసైటీ జిల్లా చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాసశర్మ తెలిపారు. సూరారం మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని రోగులను పరీక్షించి మందులు అందజేస్తారని వారు పేర్కొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో స్వామివారి ఆరాధనోత్సవం వైభవంగా నిర్వహించారు. బుధవారం నార్సింగి మండల కేంద్రంలోని శ్రీవీరబ్రహ్మంద్రస్వామి సమేత గోవిందమ్మ 332వ ఆరాధానోత్సవం నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నర్సింహాచారి, సుతారిచారి, సోమరాజ్, రమణ, శ్రీనివాస్, బ్రహ్మచారి, మల్లారెడ్డి, నారాయణరెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

దొడ్డు బియ్యం తేలితే ఫిర్యాదు చేయండి



రజాక్‌పల్లిలో రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

మిక్స్‌డ్ బియ్యం పరిశీలించిన తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్..

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని రజక పల్లి గ్రామంలో బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్, పౌరసరఫరాల శాఖ టెక్నీషియన్ మిక్స్‌డ్ రేషన్ బియ్యాన్ని పరిశీలించారు. బుధవారం సాక్షిలో ‘సన్నాలకు బదులు మిక్స్‌డ్ బియ్యం పంపిణీ’ అనే శీర్షికపై కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన అధికారులు రజాక్‌పల్లి గ్రామంలోని రేషన్ దుకాణంలో రేషన్ బియ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు పండించిన సన్న బియ్యంలో 33 రకాలుగా ఉంటాయని తెలిపారు. సన్న బియ్యంలో ఈ రకం బియ్యం కూడా ఉంటాయని తెలిపారు. రేషన్ డీలర్లు లబ్ధిదారులకు పంపిణీ చేసేటప్పుడు సంచులో ఉన్న బియ్యాన్ని మొదటగా పరిశీలించి దొడ్డు బియ్యంగా తేలినట్లయితే వెంటనే సంచి తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ ఇమ్మాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇక ఫార్మర్ ఐడీ

ఏఓ శ్వేత కుమారి

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ఎనగండ్ల, సంగాయిపేట, కొంగోడు తుక్కాపూర్, పైతర గ్రామాల్లో బుధవారం ఫార్మర్ రిజిస్ట్రీలో భాగంగా రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మండల వ్యవసాయ శాఖ అధికారులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఏఓ శ్వేత కుమారి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఆధార్‌తో దేశంలోని ప్రతి పౌరుడికి గుర్తింపు ఇచ్చినట్లుగానే రైతులకు 11 నంబర్లతో కూడిన విశిష్ట సంఖ్య కేటాయిస్తామన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. రైతు విశిష్ట సంఖ్యను (ఫార్మర్ ఐడీ) పొందేందుకు రైతులు ఆధార్, భూ యాజమాన్య పాసు పుస్తకం, ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ నంబర్‌ను తీసుకొని సమీపంలోని వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు రాజశేఖర్, అంబికా పాల్గొన్నారు.



నిజాంపేట: గుర్తింపు కార్డు నమోదును చేసుకుంటున్న రైతులు

రైతు విశిష్ట గుర్తింపు నమోదు ప్రక్రియ

నిజాంపేట(మెదక్): రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి పేర్కొన్నారు. ప్రతి రైతుకు పథకంలో 14 అంకెల కూడిన విశిష్ట సంఖ్యను కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారిణి రమ్య పాల్గొన్నారు

సంక్షిప్త వార్తలు

సమ్మర్ క్యాంప్‌ను వినియోగించుకోవాలి

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రమైన మనోహరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉచితంగా సమ్మర్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నామని, 6 నుంచి 9వ తరగతి ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈఓ మల్లేశం తెలిపారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, సంగీతం, డ్యాన్స్ డ్రాయింగ్, కరాటే, చేతిరాత, యోగా, తదితర వాటిపై శిక్షణను ఇస్తున్నామన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి 20 తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులకు స్నాక్స్ సైతం అందజేస్తామన్నారు.

భక్తి శ్రద్ధలతో హోమం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని దేవులతండాలో నూతనంగా నిర్మించిన శ్రీజగదాంబదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజు బుధవారం ఆలయం వద్ద హోమం నిర్వహించారు.

శ్రీ రంగనాయక స్వామికి బండ్ల ఊరేగింపు

కొల్చారం(నర్సాపూర్): మండలంలో రంగంపేటలో కొలువైన శ్రీ రంగనాయక స్వామి పంచాహ్నిక కల్యాణ మహోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం స్వామి వారి కల్యాణోత్సవం, తదుపరి సేవా కార్యక్రమాలతో పాటు ఆదివారం తెల్లవారు జామున రథోత్సవం జరగనుంది.


వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు, హోమం, బలిహారం, స్వామివారి ఊరేగింపు అనంతరం వేణుగోపాల స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు సంజయ్‌రెడ్డి, అరుణమ్మ, ప్రధాన అర్చకుడు గోపాలకృష్ణ, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని శాలిపేట గ్రామానికి చెందిన తులసికి రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి ఉన్నారు.

సామూహిక కుంకుమార్చన



పెద్దశంకరంపేట(మెదక్): వాసవీమాత జయంతి వేడుకలను మండల ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక ఆర్యవైశ్య భవన్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మహిళా అధ్యక్షురాలు రాగం అర్చన, ప్రధాన కార్యదర్శి చకిలం విశాల, కోశాధికారి కన్నయ్యగారి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చేగుంటలో..

చేగుంట (తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో బుధవారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు.

బీటీ రోడ్డు పనులు చేయించండి

ఎమ్మెల్యేకు గౌతాపూర్ నేతల వినతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): బీటీ రోడ్డు పనులకు నిధులు మంజూరైనప్పటికీ పనులు జరగడం లేదు. బుధవారం ఎమ్మెల్యే సునీతారెడ్డిని హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసిన గౌతాపూర్ బీఆర్ఎస్ నాయకులు బీటీ రోడ్డు పనులు చేయించాలని కోరారు. చిలప్‌చెడ్ మండలం గన్యాతండా నుండి రాందాస్‌గూడ వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల బీటీ రోడ్డుకు రూ.2.05 కోట్లు మంజూరై, రెండేళ్లు కావస్తుంది. టెండర్ సైతం పూర్తయింది. కాగా పనులు జరగడం లేదు. విషయాన్ని ఎమ్మెల్యే సునీతారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో, ఆమె స్పందించి ఆర్ అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. త్వరలోనే పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆమె గౌతాపూర్ గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌కు సంబంధించిన రూ.13 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విఠల్, శంకరయ్య, మహిపాల్‌రెడ్డి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితేనే ‘స్థానికం’లో విజయం

ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్ హితబోధ



మాట్లాడుతున్న సాయి కుమార్

చేగుంట (తూప్రాన్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసే అభ్యర్థులు విజయం సాధించేలా కార్యకర్తలు పనిచేయాలని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్ పేర్కొన్నారు. చేగుంటలో బుధవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. ప్రజల సంక్షేమం కోసం చేసిన ప్రతి పనిని వివరించి వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, యూత్ కాంగ్రెస్ నాయకులు వరప్రసాద్, దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాసరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలు శ్లాఘనీయం



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజల కోసం చేసిన మంచి పనులు జీవితాంతం గుర్తుండి పోతాయని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అంతకు ముందు దంతన్‌పల్లి, కొంతన్‌పల్లి గ్రామాల్లో వెంకట్‌రామిరెడ్డి అభిమానులు ర్యాలీ నిర్వహించారు. రక్తదాన శిబిరంతో పాటు, కేక్ కట్ చేశారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గ్రామాల్లో వెంకట్‌రామిరెడ్డి చేస్తున్న సామాజిక కార్యక్రమాలు ఎంతో మందికి మేలు జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా, ఎంపీఓ తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, సీఈఓ మధు, అభిమానులు, వివిధ పార్టీల నాయకులు మాధవరెడ్డి, లక్ష్మీకాంతారావు, సుదర్శన్‌గౌడ్, టీకులపల్లి రవి, నర్సింహారెడ్డి, కమలపూల్‌సింగ్, యాదగౌడ్, బిక్షపతిరెడ్డి, నర్సింలుగౌడ్, శ్రీనివాస్, తదితరులు వెంకట్‌రామిరెడ్డిని సన్మానించారు.

అలంకారప్రాయంగా జీపీ భవనం

బిల్లులు రాక తాళం వేసిన కాంట్రాక్టర్

హవేళిఘణాపూర్(మెదక్): నూతన పంచాయతీ రాజ్‌పేట తండా పంచాయతీకు భవనం నిర్మాణం పూర్తయినా బిల్లులు రాక ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో కాంట్రాక్టర్ తాళాలు అప్పగించకపోవడంతో నిరుపయోగంగానే ఉంది. పంచాయతీ భవన నిర్మాణానికిగాను రూ.20లక్షలు మంజూరు కాగా, రూ.9లక్షలు నిధులు మంజూరయ్యాయి. మిగతా డబ్బులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు పూర్తయినా తాళం వేసి ఉంచాడు. దీంతో పంచాయతీ భవనం లేకపోవడంతో పాఠశాల ఆవరణలోనే పంచాయతీ కార్యదర్శి పని చేయాల్సి వస్తోంది. అధికారులు స్పందించి భవనం అప్పగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త

ఎస్‌ఐ నర్సింలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): సైబర్ మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ నర్సింలు అన్నారు. బుధవారం చిలప్‌చెడ్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు ఖాతా, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పొద్దన్నారు. బ్యాంకు సిబ్బంది నుంచి ఇలాంటి ఫోన్ కాల్స్ రావన్నారు. మొబైల్ ఫోన్లలో వచ్చే అనవసర లింక్‌లపై క్లిక్ చేసి, ఖాతాలో డబ్బులు పోగొట్టుకుండా జాగ్రత్త పడాలన్నారు. ఎవరైనా సైబర్ మోసగాళ్ల వలలో పడి డబ్బులు పోగొట్టుకున్నట్లయితే వెంటనే 1930కి కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ లు మిస్బావుద్దీన్, రాములు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నర్సింలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నార్సింగి జెడ్పీపాఠశాల పూర్వ విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి జెడ్పీపాఠశాల 1995–96 పదవ తరగతి పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువుకున్న సమయంలోని జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

రాంచంద్రాపూర్ గ్రామస్తుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న రాంచంద్రాపూర్ గ్రామస్తులు

నర్సాపూర్: ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడి గ్రామ ఆలయానికి కేటాయించాలని రాంచంద్రాపూర్ గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. గ్రామ మాజీ సర్పంచులు శ్రీశైలం, లక్ష్మినారాయణ, మల్లేశం, లక్ష్మయ్య, శ్రీనివాస్ తదితరులు తహసీల్దార్‌ను కలిసి తమ గ్రామంలోని హనుమాన్ ఆలయాన్ని ఆనుకుని 20గుంటల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడి గ్రామస్తులందరికి ఉపయోగపడే హనుమాన్ ఆలయానికి కేటాయించాలని వారు వినతిపత్రంలో కోరారు. ప్రభుత్వ భూమిని కాపాడేందుకు తన వంతు కృషి చేస్తానని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు.